# పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

## నేరడిగొండ పీహెచ్సీలో 'డ్రై డే'



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని హెచ్ఈఓ పవార్ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది మంగళవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దోమల నివారణ, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దీంతో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సంతోష్, ఆశా వర్కర్ రజని, పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధిహామీ కార్మికులకు మజ్జిగ పంపిణీ



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ మండల పరిధిలోని వెంకటాపురంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కార్మికులకు ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలా వెంకటరెడ్డి ప్రతిరోజూ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కార్మికులను స్వయంగా కలిసి మజ్జిగ అందజేస్తూ వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా కార్మికులు ఇబ్బందులు పడకుండా, దాహార్తిని తీర్చడంతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎండల తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు.

# గుడిహత్నూర్లో గుంతల పూడ్చివేత పనులు పూర్తి

## సర్పంచ్ ఆడే శీల చొరవతో వాహనదారులకు ఊరట



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండల కేంద్రంలో రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసి వాహనదారులు, పాదచారులకు ఉపశమనం కల్పించారు. గుడిహత్నూర్ బస్టాండ్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్లే సర్వీస్ రోడ్డు మార్గంలో, అలాగే స్థానిక శివాలయానికి వెళ్లే రహదారిలో గత కొంత కాలంగా పెద్ద గుంతలు ఏర్పడి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురికావడంతో పాటు పాదచారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామ సర్పంచ్ ఆడే శీల వెంటనే స్పందించారు. ప్రజల సమస్యను గుర్తించి ప్రత్యేక చొరవతో సిబ్బందిని రంగంలోకి దించి యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేయించారు. ప్రమాదకరంగా మారిన గుంతలను పూర్తిగా పూడ్చివేయడంతో రహదారిపై రాకపోకలు సులభతరమయ్యాయి. సమస్యపై సత్వర చర్యలు తీసుకున్న సర్పంచ్ ఆడే శీలను స్థానిక ప్రజలు, వాహనదారులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆమె చూపుతున్న చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు.

# ఓపీఎంఎస్ రశీదుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ రాములు



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగమైన ఆన్లైన్ ప్రొక్యూర్మెంట్ మేనేజ్మెంట్ సిస్టమ్ (ఓపీఎంఎస్) రశీదుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉన్న తన ఛాంబర్లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి ఎస్డబ్ల్యూసీ నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఓపీఎంఎస్ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు, రశీదుల నమోదు, ఇతర సాంకేతిక ప్రక్రియలను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏసీఎస్ఓ, సంబంధిత శాఖల అధికారులు, ఎస్డబ్ల్యూసీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఈ-మ్యాగజైన్లో ఆసిఫాబాద్ ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం

- 'ఎడ్యుషూర్' పత్రికలో వడ్లూరి రాజేష్ విజయగాథ ప్రచురణ
- హర్షం వ్యక్తం చేసిన పాఠశాల హెచ్ఎం, సిబ్బంది



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి రాష్ట్ర స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. జనాకాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వడ్లూరి రాజేష్ సాధించిన విజయాలపై రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (SCERT) ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఎస్సీఈఆర్టీ ప్రతి త్రైమాసికానికి ప్రతిష్టాత్మకంగా విడుదల చేసే 'ఎడ్యుషూర్' ఈ-మ్యాగజైన్లో ఆయన సక్సెస్ స్టోరీకి చోటు దక్కింది. తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ఇటీవల విడుదల చేసిన వాల్యూమ్-1, ఇష్యూ-3 (జనవరి, ఫిబ్రవరి, మార్చి 2026) సంచికలో "బడి మనదే.. బడి బాధ్యత మనదే" అనే శీర్షికతో రాజేష్ విద్యా సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రస్తుతం డిజిటల్ రూపంలో అందుబాటులో ఉన్న ఈ ఈ-మ్యాగజైన్, అతి త్వరలోనే అధికారికంగా భౌతిక పుస్తక రూపంలో ముద్రితం కానుంది.

**మారుమూల విద్యార్థులకు ఆధునిక విద్య:**

మారుమూల గిరిజన ప్రాంతంలోని విద్యార్థులకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి వడ్లూరి రాజేష్ అందిస్తున్న బోధనా పద్ధతులు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయి. కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా.. క్షేత్ర పర్యటనలు, సైన్స్ డ్రామాలు, సైన్స్ సెమినార్లు, సైన్స్ ఎగ్జిబిషన్లు వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా విద్యార్థులను పోటీ పరీక్షలకు ఆయన సన్నద్ధం చేస్తున్నారు. ఈ వినూత్న విద్యా విధానం విద్యార్థులలో ఆలోచనాత్మక మార్పును, సైన్స్ పట్ల విపరీతమైన ఆసక్తిని పెంపొందించింది.

**పాఠశాలలో ఘనంగా అభినందనలు:**

రాష్ట్ర స్థాయి పత్రికలో వడ్లూరి రాజేష్ విజయగాథ ప్రచురితం కావడం పట్ల జనాకాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాబాల, తోటి ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయనను ఘనంగా అభినందించారు. మారుమూల ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని, ఇలాంటి మరెన్నో మంచి కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.







# భరోసా కేంద్రం బాధితులకు అండగా నిలవాలి

## జిల్లా ఎస్పీ నితికా పంత్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ నితికా పంత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిర్వహిస్తున్న సేవలు, నమోదైన కేసులు, బాధితులకు అందిస్తున్న సహాయక చర్యలు మరియు రికార్డుల నిర్వహణను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. మహిళలు, బాలికలకు అందిస్తున్న కౌన్సెలింగ్ సేవలు, చట్టపరమైన సహాయం తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా ప్రతి కేసును సున్నితంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.కేంద్రానికి వచ్చే మహిళలు, బాలికలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని భరోసా కేంద్రం ఇన్చార్జ్ ఎస్సై దివ్య, సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. బాధితుల వివరాల గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు మరియు బాలికలపై జరిగే వేధింపులు, హింస, లైంగిక దాడులు, గృహ హింస వంటి సమస్యల బాధితులకు భరోసా కేంద్రం ఒక సహాయక వేదికగా పని చేయాలని తెలిపారు. బాధితులకు వైద్య, న్యాయ, మానసిక పరామర్శ సేవలను ఒకేచోట అందిస్తూ వారికి కొండంత అండగా నిలవాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు.మహిళలు, బాలికలు తమకు ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను లేదా భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందించి, అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో భరోసా కేంద్రం ఇన్చార్జ్ ఎస్సై దివ్యతో పాటు కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణలను సహించం

- వారం రోజుల్లో భూములు స్వాధీనం చేసుకోవాలి
- వేశ్యకాంతల చెరువు భూములపై మంత్రి పొంగులేటి సీరియస్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి పూర్తిగా విముక్తి చేసి పేదల అవసరాలకు వినియోగించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సత్తుపల్లిలోని వేశ్యకాంతల చెరువు ముంపు భూములను ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్తో కలిసి పరిశీలించి ఆక్రమణల అంశంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ భూమి అంటే పేదల ఆస్తి అని, ఎవరైనా ఆక్రమించి ఉంటే అంగుళం కూడా విడిచిపెట్టకుండా తిరిగి స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు. చెరువు ముంపు, శిఖం, ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి వెంటనే ఆక్రమణల నుంచి విముక్తి కల్పించాలని పేర్కొన్నారు. కొంత మంది వ్యక్తులు అక్రమంగా ప్రభుత్వ భూములను సాగు చేసుకోవడమే కాకుండా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా పొందుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. ఆక్రమణల తొలగింపు అనంతరం భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, అవసరమైన నిధులు, సిబ్బందిని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. వారం రోజుల్లో ప్రభుత్వ భూములను పూర్తిగా స్వాధీనం చేసుకుని పేదల ఇళ్ల స్థలాల కోసం సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సర్వే ప్రక్రియలో రైతుల చట్టబద్ధమైన పట్టా భూములకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, మున్సిపల్ చైర్మన్ ఎండి రెహానా బేగం, అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుపై వామపక్షాల రాస్తారోకో

- కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళన




**ఉద్యమ కెరటం, వరంగల్:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రాస్తారోకో కార్యక్రమంలో భాగంగా వరంగల్లో మంగళవారం నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, ఎంసీపీఐ(యు) రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు డి.హరినాథ్, సీపీఎం నాయకులు సీహెచ్ బాబురావు, ఎస్యూసీఐ నాయకులు అమర్నాథ్ పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇంధన ధరల పెంపు సామాన్య ప్రజలపై అదనపు భారం మోపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, ప్రజల జీవన వ్యయాన్ని పెంచే విధానాలను ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు కాసాని గణేష్, సయ్యద్ సలీం, రాచపూడి బాబురావు, జిల్లా కమిటీ సభ్యులు అనకాపల్లి కనకరాజు, కంకిపాటి అనీల్, పార్టీ సభ్యులు కె.కొండలరావు, ఎం.వెంకట్రావు, వై.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా అదనపు కలెక్టర్ రాములు




**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. మంగళవారం హాజీపూర్, భీమారం, జైపూర్ మండలాల తహశీల్దార్ కార్యాలయాలను బి సెక్షన్ సూపరింటెండెంట్ మధుసూదన్తో కలిసి సందర్శించారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం, సాదాబైనామా దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా చేపడుతున్న మూడో విడత ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించేలా చర్యలు తీసుకోవాలని, సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి పోర్టల్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నందున పెండింగ్లో ఉన్న దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. సాదా బైనామా దరఖాస్తులను క్షేత్రసాయిలో విచారణ జరిపి, పూరి సాయిలో పరిశీలించి ఆమోదించాలని అన్నారు. అలాగే కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, సర్టిఫికెట్లను నిబంధనల మేరకు నిర్ణీత గడువులోగా జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలి

- **ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి**
- **ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున**



**ఉద్యమ కెరటం, హన్మకొండ:** ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్డీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం హన్మకొండ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎల్.వి.గిరిరాజ్ గౌడ్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా సంస్థలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 15 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నప్పటికీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్' పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది, ఎంఈఓ, డీఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అడ్మిషన్, పుస్తకాలు, స్టేషనరీ, ల్యాబ్, డెవలప్మెంట్, కోచింగ్ ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారని వాపోయారు. జిల్లా ఫీజుల నియంత్రణ కమిటీ (డీఎఫ్ఆర్సీ) సూచనల మేరకు మాత్రమే ఫీజులు నిర్ణయించాలని, ప్రతి పాఠశాలలో ఫీజుల వివరాలను ప్రదర్శించే బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. విద్య హక్కు చట్టం ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు 25శాతం సీట్లు ఉచితంగా కేటాయించాల్సి ఉన్నప్పటికీ చాలా విద్యా సంస్థలు అమలు చేయడం లేదని అన్నారు. అనుమతులు లేకుండా అదనపు బ్రాంచీలు నిర్వహించడం, రెసిడెన్షియల్ అనుమతులు లేకుండా హాస్టళ్లు నడపడం, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు లేకుండా తరగతులు నిర్వహించడం వంటి అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# జర్మన్ భాషా శిక్షణతో విదేశీ ఉపాధి అవకాశాలు

**జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్కామ్), ఉపాధి శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమం ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ తెలిపారు. ఈనెల 10న ఉదయం 10గంటలకు మందమర్రి మండల కేంద్రంలోని ఇల్లందు క్లబ్లో రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద చేతుల మీదుగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా జర్మనీతో పాటు ఇతర యూరోపియన్ దేశాల్లో ఉపాధి అవకాశాలు పొందేందుకు అవసరమైన భాషా నైపుణ్యాలను అభ్యర్థులకు అందజేయనున్నట్లు చెప్పారు. జర్మన్ భాషలో ప్రాథమిక, మధ్యస్థాయి పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలకు యువతను సన్నద్ధం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. విదేశీ ఉపాధి అవకాశాలపై ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును మెరుగుపర్చుకోవాలని సూచించారు.

# ఘనంగా భగవాన్ బిర్సా ముండా వర్ధంతి



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఆదివాసి స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తుడుందెబ్బ బోథ్ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, ఆదివాసి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, ఆదివాసీల హక్కుల సాధన కోసం బిర్సా ముండా చేసిన త్యాగాలు, సేవలను నాయకులు స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నాగేష్, ఆదివాసి బిర్దు గోండ్ తోటి సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి చాహకటి పవన్ కుమార్, తుడుందెబ్బ మండల కార్యదర్శి కోట్నాక్ జంగు, ఆదివాసి నాయకులు సిడం హరిరామ్, సిడం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు ప్రభుత్వం మరో ముందడుగు

- **జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్**
- **నవభారతి మండల సమైక్య సంఘానికి ఉచిత బస్సు**



**ఉద్యమ కెరటం, ములుగు:** రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో ములుగు మండలం నవభారతి మండల సమైక్య సంఘానికి ఉచిత బస్సు మంజూరైంది. ఈ సందర్భంగా హైదరాబాద్లోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరిగే బస్సుల పంపిణీ కార్యక్రమానికి బయలుదేరిన బస్సును ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బానోత్ రవిచందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధి, సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. నవభారతి మండల సమైక్య సంఘానికి అందిన ఈ బస్సు మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి ఆర్థిక పురోగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ బస్సు కేవలం ఒక వాహనం మాత్రమే కాకుండా మహిళల అభివృద్ధికి, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వివిధ ఆర్థిక కార్యకలాపాల్లో మరింత రాణించాలని సూచించారు. ప్రభుత్వం మహిళలను స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు చేపడుతున్న చర్యలు ఆదర్శవంతమని, ఈ బస్సు ద్వారా నవభారతి మండల సమైక్య సంఘం సభ్యులు మరింత అభివృద్ధి సాధించి ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్పర్సన్ ఆసియా షాహిన్ మీర్జా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ కొండ రవీందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అలోత్ దేవ్ సింగ్, మాజీ ఎంపీటీసీ మావురపు తిరుపతి రెడ్డి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, గుర్తురుతండా సర్పంచ్ రాజు నాయక్, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- **ముఖ్రా(కె)ను ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతాం**
- **కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ(ఇచ్చోడ):** ముఖ్రా(కె) గ్రామాన్ని గుడిసెలు లేని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. ముఖ్రా(కె) సర్పంచ్ గైక్వాడ్ జైపాల్ ఆహ్వానం మేరకు మంగళవారం గ్రామాన్ని సందర్శించిన ఆయన మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తుల నుంచి అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి సహకరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గైక్వాడ్ జైపాల్, ఉప సర్పంచ్ పవర్ బాలాజీ, ఇచ్చోడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్ళెం నారాయణ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ సత్యవతి కోటేశ్వర్, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ పనులు ప్రారంభం



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం గోపాల్ నగర్ గ్రామపంచాయతీలో డ్రైనేజీ పనులను గోపాల్ నగర్ గ్రామ సర్పంచ్ గాట్ల నర్సయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎంఎఫ్ టి రూ.5లక్షల నిధులతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీడీఓ పి.శ్రీనివాస్, మాజీ సింగల్ విండో చైర్మన్ గట్టు మురళీధర్ రావు, ఉప సర్పంచ్ గాజుల సునీత రామ్మోహన్, కాంగ్రెస్ పార్టీ తాండూర్ మండల అధ్యక్షులు పెద్దబోయిన శంకర్, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, వార్డు సభ్యులు బుర్స బాయక్క, గజ్జల సత్యనారాయణ, మేడి శంకర్, గాజుల తిరుపతి, గజ్జల జనార్ధన్, కోటి భీమయ్య, రావుల రాజయ్య, గాట్ల పోసం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఓటర్ల మ్యాపింగ్ను విజయవంతం చేయండి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ–2002 (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓ, ఎంఆర్ఓల సమక్షంలో తన ఓటును ఎస్ఐఆర్ ఎలక్టోరల్ రోల్కు మ్యాపింగ్ చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2002 ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో తనకు ఓటు లేకపోవడంతో బీహార్లో ఉన్న తన తండ్రి ఓటరు వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం వెబ్సైట్ voters.eci.gov.in లోని 'సెర్చ్ బై ఎలెక్టర్ నేమ్' ద్వారా కేవలం ఐదు ప్రాథమిక వివరాలు నమోదు చేసి సులభంగా సేకరించినట్లు తెలిపారు. అనంతరం బీఎల్ఓ యాప్ ద్వారా మ్యాపింగ్ పూర్తి చేసినట్లు వివరించారు. ఈ ప్రక్రియ అత్యంత సరళమైనదని అన్నారు. తెలంగాణలో పాత ఓటరు వివరాలు ఉన్నవారు ceo.telangana.gov.in వెబ్సైట్ ద్వారా కూడా ఎస్ఐఆర్–2002 వివరాలను తెలుసుకోవచ్చన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణం, మావల ప్రాంతాల ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటర్ల మ్యాపింగ్కు జూన్ 24 వరకు గడువు ఉందని, అనంతరం జూన్ 25 నుంచి బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. గడువులోపు ప్రతి ఓటరు తమ వివరాలను మ్యాపింగ్ చేసుకోవాలని కోరారు. జిల్లాలో ఓటర్ల జాబితా పకడ్బందీగా రూపొందించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తహశీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ యజ్వేందర్, బీఎల్ఓ నివేదిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలపై ఆటో కార్మికులకు అవగాహన**




**ఉద్యమ కెరటం, తాండూర్:** ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తాండూర్ ఏఎస్సై రాజమౌళి అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాండూర్ పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐబీలో ఆటో కార్మికులకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు రాజు నాయక్, లింగయ్య, సిబ్బంది, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**మరొకరికి తీవ్ర గాయాలు**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని రోడ్డు లఖంపూర్ గ్రామ సమీపంలో జాతీయ రహదారి 44పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాడవి శేఖరావ్(45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గోండు లఖంపూర్ గ్రామానికి చెందిన మాడవి శేఖరావ్ తన ఆటోను మరమ్మతు చేయించుకునేందుకు నేరడిగొండ నుంచి కుమారి గ్రామానికి చెందిన మరో వ్యక్తిని ఎక్కించుకొని వెళ్తున్నారు. రోడ్డు లఖంపూర్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న శేఖరావ్ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. ఆటోలో ఉన్న మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని మెరుగైన చికిత్స కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి కారణమైన వాహనం కోసం దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య మాడవి సింధు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో లఖంపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

